
సాక్షి
ఒడిశా
మంగళవారం । 18 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం

నగదు:	రూ.7,68,877
బంగారం:	02 గ్రాముల 960 మిల్లీగ్రాములు
వెండి:	02 గ్రాముల 590 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

భక్తిశ్రద్ధలతో బక్రీద్



బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

- 8లో ▸



బాలాశ్రమాల అభివృద్ధికి కృషి

బాలాశ్రమాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అన్నారు. సమితి పరిధిలోని పలు బాలాశ్రమాలను కలెక్టర్ సందర్శించారు.

- 8లో ▸

న్యూస్‌రీల్

విక్రమదేవ్ వర్మ జయంతి వేడుకలకు ఆహ్వానం



జయపురం యువరాణిని ఆహ్వానిస్తున్న సాహిత్య పరిషత్ బృందం

జయపురం: జయపురం మహారాజు రాజశ్రీ విక్రమదేవ్ వర్మ జయంతి వేడుకలు ఈ నెల 28న ఘనంగా నిర్వహించనున్నట్లు జయపురం సాహిత్య పరిషత్, జిల్లా సాహిత్య పరిషత్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు వేడుకల్లో గౌరవ అతిథులుగా పాల్గొనాల్సిందిగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, యువరాణి సరితాదేవిలను సోమవారం కలిసి ఆహ్వానపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయక్, డాక్టర్ ప్రమోద్‌కుమార్ మిశ్రా, నవకృష్ణ రథ్, సుధాంశు శేఖర పట్నాయక్, ప్రమోద్‌కుమార్ రౌళో తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రెడ్‌క్రాస్ చేయూత



దహన సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ జిల్లా అప్పర్ కొలాబ్ ప్రాజెక్టు కొలాబ్‌నగర్ ప్రాంతంలో మట్టి తవ్వుతుండగా చరియలు విరిగిపడటంతో ఆదివారం ముగ్గురు యువతులు మృతి చెందిన విషయం విదితమే. సలమనగుడ గ్రామంలో వీరి మృతదేహాలను సోమవారం ఒకేచోట దహనం చేశారు. దహన సంస్కారాలకు మృతి కుటుంబాలకు రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ. 20 వేలు చొప్పున అధికారులు ఆర్థిక సహాయం అందించారు. హరిశ్చంద్ర యోజనలో భాగంగా మరో రూ.2 వేలు సాయం అందజేశారు. మృతులంతా పేదలని, వారి కుటుంబాలకు సీఎం రిలీఫ్ నిధి తరఫున ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన గజేంద్ర ప్రస్కా

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి బుడాగుండ పంచాయతీ కార్యాలయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. సునాఖండి పంచాయతీ మోనేయిగుడకు చెందిన ముఖేష్ ప్రస్కా, గజేంద్ర ప్రస్కా బైకుపై పొరుగు గ్రామమైన భలుమస్కా సొంత పనిమీద వెళ్లారు. తిరిగి వస్తుండగా బైకు అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో కళ్యాణ సింగుపూర్ ఆస్పత్రికి తరలించారు.

72 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

రాయగడ: కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పద్మపూర్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పద్మపూర్ సమితి సుందర్‌పూర్ ప్రాంతానికి చెందిన ప్రకాష్ బీరా, పుషి గ్రామానికి చెందిన సంజయ్ బిబిరియా, గజపతి జిల్లా ఉదయగిరి ప్రాంతానికి చెందిన శరత్ చంద్ర పారిచ్ఛాగా గుర్తించారు. గంజాయి రవాణా అవుతుందన్న సమాచారం మేరకు పద్మపూర్ పోలీసులు సుందర్‌పూర్ కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సుందర్‌పూర్ నుంచి రాయగడ మీదుగా వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో 72 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుల నుంచి గంజాయి, మూడు ఫోన్లు, రూ.510 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు.

ప్రజా సేవకుడు..!



రోగికి స్వయంగా మందులు వేస్తున్న ఎమ్మెల్యే మంగు ఖీలో




బాధితులకు పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఈ చిత్రాల్లో రోగికి సపర్యలు చేస్తున్నది కుటుంబ సభ్యుడో.. బంధువో.. ఆస్పత్రి సిబ్బందో కాదు. సాక్షాత్తు చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖీలో. చాలామంది నాయకుల మాదిరిగా ఎన్నికలు పూర్తికాగానే ప్రజలను గాలికొదిలేయకుండా ప్రజా సేవలో ఉంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇబ్బందుల్లో ఉన్న వారికి అండగా ఉంటూ భరోసా ఇస్తున్నారు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వభీమాన్ ఏరియాలో కొన్నాళ్లుగా గిరిజనులు వింతవ్యాధితో ఇబ్బందిపడుతున్నారు. బాధితులంతా కొరాపుట్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మంగు ఖీలో సోమవారం ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో చర్చించి బాధితులను పరామర్శించి పండ్లు అందజేశారు. స్వయంగా మందులు వేసి ధైర్యం చెప్పారు. ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇక్కడి గిరిజనులు జ్వరం, విరోచనాలు, కాళ్లనొప్పులు తదితర లక్షణాలతో బాధపడుతున్నారని, రక్త పరీక్షల ఆధారంగా తదుపరి చికిత్స అందిస్తామని వైద్యులు ప్రకటించారు.

– మల్కన్‌గిరి

బురదలపోలమ్మ.. ఉత్సవాలు ప్రారంభం



బురదల పోలమ్మ అమ్మవారు



ఆదివాసీ వాయిద్య పరికరాలకు పూజలు చేస్తున్న పూజారి బలముండ



విద్యుత్ అలంకరణలతో రాయగడ పట్టణం

రాయగడ: రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ వార్షిక ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక మెయిన్ రోడ్డు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డులో అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను నిలిపి ఆదివాసీ వాయిద్యాలతో ఆలయ ప్రధాన పూజారి బలముండ పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం పట్టణ ప్రముఖులు జిల్లా ట్రెజరీ కార్యాలయానికి చేరుకుని సంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి పాదాలను తీసుకువచ్చారు. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ షెడ్డు వద్ద ఘటాలకు పూజలు నిర్వహిస్తారు.

సందడిగా పట్టణం..

ఉత్సవాల సందర్భంగా పట్టణం సందడిగా కనిపించింది. మెయిన్ రోడ్డు విద్యుద్దీపాలంకరణలతో కళకళలాడుతోంది. ఈ తొమ్మిది రోజులూ పూజారులతో పాటు ఘటాలను మోసే పేరంటాలు నియమనిష్టలతో పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో బురదల పోలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పతివాడ శ్రీనివాస్ నాయుడు, ఉపాధ్యక్షుడు ఎద్దు శ్రీహరి, పట్టణ ప్రముఖులు బార్ధి ప్రసాద్‌రావు, సీర రమణ, కింతలి కరుణాకర్, పెద్దినవాసు, పతివాడ భాస్కరరావు పాల్గొన్నారు.



అమ్మవారి పాదాలు తీసుకువచ్చే కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు



తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డు



పేరంటాలు


గజరాజుల హల్‌చల్



ఏనుగులు ధ్వంసం చేసిన ఇళ్లు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి నియమగిరి ప్రాంతం పర్శాలి పంచాయతీ లేఖాపాదరొ గ్రామంలో ఏనుగులు భీభత్సం సృష్టించాయి. కొండపై ఉన్న మట్టి ఇళ్లను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన కృషాకొ డ్రిజ్కా, బామున్ను కద్రక, పెటా సికక, పులమా కద్రకల ఇళ్లల్లో చొరబడి రాగులు, బియ్యం తిని వస్తు సామగ్రిని నాశనం చేశాయి. ఆదివారం అర్ధరాత్రి నాలుగు ఏనుగులు ఈ విధ్వంసాన్ని సృష్టించాయని బాధితులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ఏనుగులను ఆ ప్రాంతం నుంచి తరిమికొట్టేందుకు చర్యలు చేపట్టారు.

20 వరకు పాఠశాలలకు సెలవు



పర్లాకిమిడి: తీవ్ర వడగాలులు, ఉక్కపోత దృష్టిలో ఉంచుకుని గజపతి జిల్లాలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి పాఠశాలలు, హైస్కూళ్లు, జూనియర్ కళాశాలలకు ఈ నెల 20 వరకు కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి సెలవు ప్రకటించారు. ఈ ఆదేశాలను అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మంగళవారం నుంచే పాటించాలని డీఈఓ పేర్కొన్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా



గుమ్మ జలపాతం

- గుమ్మ జలపాతంలో పడి అన్నదమ్ముల మృతి
- జయపురంలో విషాదం



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

జయపురం: సెల్ఫీ సరదా రెండు నిండు ప్రాణాలను బలితీసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. జయపురం బైపాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన ప్రదీప్ సాహు, సందీప్ సాహు అన్నదమ్ములు. సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి మల్కన్‌గిరి జిల్లా ఖొయిర్‌పుట్ సమితి మడకాపాదర్ గ్రామ పంచాయతీ వద్ద ఉన్న గుమ్మ జలపాతం వద్దకు వన భోజనాలకు వెళ్లారు. కుటుంబంతో సరదాగా గడిపిన అన్నదమ్ములిద్దరూ స్నానం చేసేందుకు జలపాతం వద్దకు వెళ్లారు. ఆ సమయంలో సెల్ఫీ తీసుకుంటుండగా ఒక్కసారిగా ఎత్తయిన ప్రాంతం నుంచి నీటిలోకి జారిపడ్డారు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు వెంటనే వచ్చి నదిలోకి దూకి అన్నదమ్ములను బయటకు తీశారు. ఇద్దరినీ అంబులెన్సులో మత్తిలి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంతవరకు తమతో ఉన్న వారు ఇక లేరని తెలిసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

పిడుగుపాటుకు 20 ఆవులు బలి



మృతి చెందిన ఆవులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి తండికి గ్రామ పరిధిలో ఆదివారం పిడుగుపాటుకు 20 ఆవులు మృత్యువాతపడ్డాయి. ఎప్పట్లాగే తండికి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి ఆవుల మందను తీసుకెళ్లి మేపుతుండగా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం మొదలైంది. కాపరి వెంటనే ఆవులను చెట్ల కిందకు పంపి పిడుగుల భయంతో ఇంటికి వచ్చేశాడు. చీకటి పడినా ఆవులు ఇళ్లకు తిరిగి రాకపోవడంతో అడవిలోనే ఉంటాయని భావించారు. సోమవారం ఉదయం వెళ్లి పరిశీలించగా అటవీ ప్రాంతంలో పిడుగుల ధాటికి ఆవులన్నీ మృతిచెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి దయానిధి నిమాల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సమైక్యతకు ప్రతీక రొజొ పండగ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: ఒడిశా ప్రజల సమైక్యతకు అద్దంపట్టే రొజొ పండగ రాష్ట్ర సరిహద్దులు దాటి దేశ విదేశాలకు చేరిందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆదివారం రాత్రి రంగమట్టి సంస్థ లేక్‌ప్లేసిడ్ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక వేడుకల్లో ఆయన ప్రసంగిస్తూ ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రంగమట్టి సంస్థ కార్యకర్తలు శుభశ్రీ బెహరా, సుజాత బెహరా, మధుస్మిత మహాపాత్రో, పుష్పాంజలి గౌఢ, మృత్యుంజయ బెహరా, సుపిన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొట్‌పాడ్ అభివృద్ధికి కృషి



కుంధ్ర గ్రామస్తులతో ఎమ్మెల్యే రూప భొత్ర

జయపురం: కొట్‌పాడ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రూప భొత్ర తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం తొలిసారిగా తన నియోజకవర్గంలో భాగమైన కుంధ్ర సమితిలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దిగాపూర్ మండలి బీజేపీ అధ్యక్షుడు బద్రి నారాయణ ఆచార్య, కుంధ్ర మండలి అధ్యక్షులు సుందర మాలీ, తంబు పాత్రో, తుషార్ భట్, లక్ష్మణ భొత్ర, పద్మణ బిశాయి, ఉమాకాంత పండా, సాయిబ్ హల్వ, శేషానంద బిశాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

'రోటరీ సేవలు విస్తృతం చేస్తాం'

సోంపేట: రోటరీ ద్వారా అందిస్తున్న సేవలు విస్తృతం చేస్తామని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు దత్తా అన్నారు. సోంపేట రోటరీ క్లబ్‌లో సోంపేట, పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం, విజయనగరం సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ సుబ్బారావు దత్తా మాట్లాడుతూ రోటరీ ద్వారా అందిస్తున్న సేవలు విలువైనవని పేర్కొన్నారు. అనంతరం సువాగడ గ్రామం ట్రైబల్ పాఠశాలకు 50 బెడ్లు, 10 ఫ్యాన్లు అందజేశారు. అనంతరం రోటరీ గవర్నర్ సుబ్బారావు దత్తాను రోటరీ ప్రతినిధులు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పి.దినేష్ కుమార్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఎం.భాస్కరరావు, సోంపేట రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీ కృష్ణారావు, కోశాధికారి రవి, ప్రతినిధులు శివశంకర్, లక్ష్మీనారాయణ, దున్న రమేష్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమారుద్రకోటేశ్వర స్వామి కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం గుడివీధిలో ఉన్న ఉమారుద్ర కోటేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల నేతృత్వంలో శివ పార్వతుల ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచి గన్నవరపు కృష్ణారావు, రాజేశ్వరమ్మ దంపతులతో కల్యాణ వేడుకలు నిర్వహించారు. ముందుగా సర్పవాహనంపై స్వామివారికి తిరువీధి నిర్వహించారు.

పైనాపిల్ పండింది

ఎల్.ఎన్.పేట: గిరిజనులు పండించే వాణిజ్య పంటల్లో పైనాపిల్ ప్రధానమైనది. గతంతో పోల్చిచూస్తే ఈ ఏడాది ఈ పంట బాగా పండిందని గిరిజనులు చెబుతున్నారు. మండలంలోని మురగడలోవ, సూదిరాయిగూడ, జోగివలస, కొత్తవలస, కొత్తగూడ, జమ్మడుపాకలు, ఇరుకురాయిగూడ, కొత్తజోగివలస, బాలేరు, జంబాడ తదితర ప్రాంతాల్లో గిరిజనులు పోడు పంటగా పండించే పైనాపిల్ పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. పైనాపిల్ కాయ సైజు పెద్దగా ఉండటంతో ఒక్కో కాయ రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తున్నామని గిరిజనులు చెబుతున్నారు. అలికాం-బత్తిలి ప్రధాన రహదారి పక్కన ప్రధాన కూడళ్ల వద్దకు తీసుకుని వెళ్లి రోడ్డుపక్కనే విక్రయిస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన నర్సిపురం కృష్ణారావు, నర్సిపురం పాపమ్మలు సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. టెక్కలి మండలం శాసనాం గ్రామ సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వారిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఒడిశా నుంచి వస్తున్న కారు, బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వీరిని స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేయగా క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

వైభవంగా ముఖలింగేశ్వరుని కల్యాణోత్సవం



జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం పార్వతీపరమేశ్వరుల కల్యాణ క్రతువు వైభవంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. కొట్నం దంపు కార్యక్రమాన్ని ముత్తైదువులు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం నిర్వహించారు. ఉత్సవానికి ముందు పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం పాంచరాత్రి ఉత్సవాల్లో భాగంగా జ్యేష్ఠమాసం సోమవారం రెండో రోజు లక్ష్మీనరసింహ స్వామి వారి కల్యాణ ఉత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు, పురోహితులు జనార్ధన శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



పర్లాకిమిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మసీదులో నమాజు చేస్తున్న చిన్నారి



నమాజ్ చేస్తున్న ముస్లింలు

బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈదుల్ అజ్‌హా, ఈదె ఖుర్బాన్‌గా పిలిచే ఈ పండగ సందర్భంగా పర్లాకిమిడి మటియా వీధిలోని జామియా మసీదు నుంచి డోలా ట్యాంకు రోడ్డులో ముస్లిం సోదరులు ర్యాలీగా బయలుదేరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

–పర్లాకిమిడి

బాలాశ్రమాల అభివృద్ధికి కృషి



బి.సీతాపురం బాలాశ్రమం చిన్నారులతో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: బాలాశ్రమాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అన్నారు. బి.సీతాపురంలోని బాలాశ్రమాన్ని సోమవారం కలెక్టర్ సందర్శించారు. రోజో సంక్రాంతి ముగింపు సందర్భంగా అక్కడి అనాథ బాలబాలికలు సంబల్‌పురి, ఒడిస్సీ డ్యాన్సులు చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఒడియా సంస్కృతి, పండగల ఆవశ్యకతను కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, శిశు సంక్షేమశాఖ అధికారి మనోరమా దేవి, వన్ స్టాప్ సెంటర్ అధ్యక్షురాలు సునితా రోథో, శిశు సంక్షేమ సమితి అధ్యక్షురాలు మమతా శతపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుసాని సమితి ఆర్.సీతాపురంలోని జగన్నాథ నికేతన్ అనాథాశ్రమాన్ని కలెక్టర్ సందర్శించి బాలబాలికలతో మాట్లాడారు. సౌకర్యాల కల్పనకు తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన బాలలకు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో జగన్నాథ నికేతన్ అధ్యక్షుడు హరిమోహన్ పట్నాయక్, కోశాధికారి దామోదర్ జెన్నా, కార్యదర్శి అనాది పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.



పాటికోట జాగృతి ఆధ్వర్యంలో రొజ్జో సంక్రాంతి ఉత్సవాలు

ఐటీఐ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో ప్రవేశాలకు మంగళవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లు చేశారు. ఎచ్చెర్ల ఐటీఐలో ఈ నెల 18 నుంచి 23 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 25, 26 తేదీల్లో గైర్హాజరైన వారికి, సీట్లు రాని వారికి ఖాళీ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఆన్‌లైన్ పద్ధతిలో పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లా నుంచి 2470 దరఖాస్తులు రాగా, మార్కులు బట్టి ర్యాంకు నిర్దేశించి షెడ్యూల్ మేరకు విద్యార్థుల సెల్ ఫోన్‌లకు సంక్షిప్త సమాచారం చేరవేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 3608 సీట్లు ఉన్నాయి. వచ్చిన దరఖాస్తుల కంటే 1138 ఎక్కువ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీఐల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ వంటి వాటికి మంచి డిమాండ్ ఉంది. రోజూ ఉదయం 9 నుంచి 1 గంట, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఐదు గంటలు వరకు రెండు షిఫ్టుల్లో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.



ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ

జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాస డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీల్లో 716 సీట్లు ఉన్నాయి. మిగతా 20 ప్రైవేట్ ఐటీఐల్లో 2892 సీట్లు ఉన్నాయి. విద్యార్థులు ర్యాంకులు వారీగా కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. మొదటి రోజు ఉదయం 1 నుంచి 193 ర్యాంకు, మధ్యాహ్నం 194 నుంచి 413 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

డిగ్రీ కళాశాలల పరిశీలనకు అఫిలియేషన్ కమిటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ కళాశాలల పరిశీలనకు అఫిలియేషన్ కమిటీల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 104 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 15 ప్రభుత్వ కళాశాలలు, 89 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలలకు అఫిలియేషన్‌ను వర్సిటీ మంజూరు చేయాల్సి ఉంటుంది. అఫిలియేషన్ కమిటీలు మౌలిక వసతులు, టీచింగ్ ఫ్యాకల్టీ అర్హతలు, ఉన్నత విద్యా మండలి ఇతర నిబంధనలు పరిశీలించి అనుమతులు ఇస్తారు. అనుమతులు ఇచ్చిన కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు నిర్వహిస్తారు. ముందుగా ఏపీ ఈఏపీ సెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్ష) కౌన్సెలింగ్ జరగటం, డిగ్రీ ప్రవేశాలు జాప్యం జరగటంతో ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు జరగటం లేదని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఉన్నత విద్యాశాఖకు ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యాశాఖ అధికారులు వర్చువల్ సమావేశం నిర్వహించి అఫిలియేషన్ కమిటీల పరిశీలన త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 25లోపు అఫిలియేషన్ కమిటీల పరిశీలనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూలై నెల మొదటి వారంలో డిగ్రీ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీలా సుజాత మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ సూచనల మేరకు అఫిలియేషన్ కమిటీలు వేయనున్నట్లు చెప్పారు.

చింతపల్లి బీచ్‌లో వ్యక్తి గల్లంతు





గల్లంతైన వ్యక్తి కోసం విచారణ చేస్తున్న పూసపాటిరేగ ఎస్‌ఐ సన్యాసినాయుడు (ఇన్‌సెట్లో), గల్లంతైన వ్యక్తి అబ్దుల్‌కలాం మాలిక్ (వృత్తంలో)

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లిబీచ్‌కు స్నానానికి వెళ్లిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం గ్రామం సమీపంలో గల సూర్య ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న 8 మంది చింతపల్లి బీచ్‌లో స్నానానికి సోమవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో వెళ్లారు. వారిలో అబ్దుల్‌కలాం మాలిక్, మరో ఏడుగురు ఉన్నారు. అందరూ స్నానం చేస్తుండగా అబ్దుల్ కలాం మాలిక్ అకస్మాత్తుగా కనిపించలేదు. దీంతో స్నేహితులంతా బీచ్ పరిసరాల్లో వెతికినప్పటికీ ఆచూకీ తెలియరాలేదు. వెంటనే పూసపాటిరేగ ఎస్‌ఐ ఎ.సన్యాసి నాయుడికి సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో ఆయన హుటాహుటిన బీచ్‌కు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 2 గంటల పాటు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. స్నేహితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం ఉందా..?



- 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గతంలో ప్రోత్సాహకాల అందజేత
- ప్రభుత్వ బడుల్లో చదివి టాపర్లుగా నిలిచిన పది, ఇంటర్ విద్యార్థులకు సమున్నత గౌరవం
- రాష్ట్రస్థాయిలో టాపర్లకు రూ.లక్ష, జిల్లాస్థాయిలో రూ.50వేలు చొప్పున పంపిణీ
- ఈ ఏడాదికి సంబంధించి ఇంతవరకు విద్యాశాఖకు అందని మార్గదర్శకాలు



పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు(ఫైల్)

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి టాపర్లుగా నిలిచిన వారికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమున్నత గౌరవం కల్పించింది. 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట టాపర్లకు విరివిగా ప్రోత్సాహకాలు అందజేసింది. విద్యా సంవత్సరం ప్రారంభమైన వారం రోజుల్లోనే ఈ ప్రోత్సాహకాలను అందజేసేవారు. అయితే కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రోత్సాహకం ఉందా లేదా అని ప్రభుత్వ బడుల టాపర్లు అయోమయంలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటి వరకు విద్యాశాఖ కార్యాలయాలకు ఎలాంటి మార్గదర్శకాలు జారీ కాలేదు.

వెన్నుతట్టి ప్రోత్సహించి..

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను మరింత ప్రోత్సహించే దిశగా 2023–24 విద్యా సంవత్సరం నుంచి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు కీర్తించారు. వివిధ మేనేజ్‌మెంట్లలో పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలిచిన 1246 మందిని, నియోజకవర్గస్థాయిలో 39 మందిని, ఇంటర్మీడియెట్ విద్యార్థులు 33 మందిని, జిల్లా స్థాయిలో టాపర్లుగా నిలిచిన మేనేజ్‌మెంట్లవారీగా టెన్త్‌క్లాస్ 29 మంది, ఇంటర్మీడియెట్ 18 మందికి బహుమతులు అందజేసేవారు. ఇంటర్మీడియెట్‌లో గ్రూపుకు (ఎంపీసీ/బైపీసీ/హెచ్‌ఈసీ/సీఈసీ/ఎంఈసీ) ఒకరికి చొప్పున ఎంపిక చేసేవారు.



గత ఏడాది టెన్త్‌క్లాస్ విద్యార్థులు

ఈ ఏడాదికి జారీ కాని మార్గదర్శకాలు..

కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ప్రోత్సాహకాల విషయంలో ఎలాంటి నూతన మార్గదర్శకాలు ఇంకా జారీ కాలేదు. ప్రభుత్వ విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించి విద్యాశాఖ కార్యాలయానికి ఎలాంటి మార్గదర్శకాలు ఇప్పటివరకు జారీ కాలేదని అధికారులు ధ్రువీకరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి టాపర్లకు రూ.లక్ష నజరానా

పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి మూడు స్థానాలకు వరుసగా రూ. 3 వేలు, 2వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేశారు. వీటితోపాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్ అందజేశారు. నియోజకవర్గస్థాయిలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురికి వరుసగా రూ.15 వేలు, రూ.10వేలు, రూ.5 వేలు చొప్పున అందజేశారు. అలాగే ఇంటర్‌లో ఒక్కో గ్రూపులో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి రూ.15 వేలు చొప్పున అందజేశారు. ఇక జిల్లాస్థాయిలో పదో తరగతిలో మొదటి ర్యాంకర్‌కు రూ.50 వేలు, రెండో ర్యాంకర్‌కు రూ.30 వేలు, మూడో ర్యాంకర్‌కు రూ.15వేలు వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలను మేనేజ్‌మెంట్ల వారీగా అందజేసి, సన్మానించారు. అలాగే ఇంటర్‌లో గ్రూపునకు ఒకరు చొప్పున టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున అందజేశారు. ఇక రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచిన టెన్త్ విద్యార్థులకు మొదటి మూడు స్థానాలకు వరుసగా రూ.లక్ష, రూ.75వేలు, రూ.50 వేలు చొప్పున, అలాగే ఇంటర్‌లో టాపర్లకు గ్రూపునకు ఒకరు చొప్పున రూ.లక్ష అందజేశారు.

పంటల మార్పిడి.. అధిక దిగుబడి



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

- పంటల సాగులో వైవిధ్యం చూపితే అనేక ప్రయోజనాలు
- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం
- ఒకే పంట వేయడం వల్ల చీడపీడల ఉద్ధృతి అధికం

హిరమండలం: పొలంలో ఏళ్ల తరబడి ఒకే పంటను సాగు చేయడం రైతుతో పాటు ఆ భూమికి కూడా మంచిది కాదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు అంటున్నారు. ఒకే రకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థంగా వినియోగించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలుగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ ఏడాది వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అన్నదాతలు పంటమార్పిడి ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవాలని చెబుతున్నారు.

ఒకే తరహా పంటతో నష్టమే

- ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యంగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగుచేసుకోవాలి.
- ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైరులు తక్కువ లోతుకు వెళ్లే పైరులు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి.
- నేలను నిర్వీర్యం చేసే పంటలను సారాన్ని అభివృద్ధి చేసే పంటను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి

పంట మార్పిడితో భూసారం వృద్ధి

- వరి పంట సాగుచేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగుచేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రీయ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.
- వరి తర్వాత అపరాలు లాంటి పైరు సాగుచేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉద్ధృతి తగ్గుతుంది.
- వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగుచేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియస్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లులో బొడిపెల మాదిరిగా ఏర్పాడి తర్వాత సాగుచేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

యూబీ ఉద్యోగులపై కేసు నమోదు

రణస్థలం: మండలంలోని యూబీ పరిశ్రమ ఉద్యోగులు కులం పేరుతో దూషించారని ఆ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు యామల చిన్నారావు, నేతల ఈశ్వరరావు, లక్ష్మణరావు ఫిర్యాదు చేశారని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూబీ పరిశ్రమలో ఈ నెల 15వ తేదీన ఉద్యోగులు, కార్మికుల మధ్య వివాదం తలెత్తింది. కార్మికులు తమ జీతాలు పెంచాలని, పూర్తి స్థాయి పనిదినాలు కల్పించాలని, లోడింగ్, అన్‌లోడింగ్ కమిషన్ ఇవ్వాలని ఉన్నత స్థాయి ఉద్యోగులను వెళ్లి కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో బంటుపల్లి యూబీ యూనిట్ హెచ్ డి.రామకృష్ణతో పాటు మరో 8మంది ఉద్యోగులు తమను కులం పేరుతో దూషించి మెడ పట్టుకుని గెంటేశారని వారంతా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు మేరకు పరిశ్రమలో పని చేస్తున్న 8మంది ఉద్యోగులపై ఉన్నత స్థాయి అధికారుల సూచనల మేరకు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తున్నామని జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు.

బంగారం దుకాణంలో మూడు గొలుసులు చోరీ

- పట్టపగలే దొంగతనం

టెక్కలి రూరల్: టెక్కలి నడిబొడ్డున ఓ బంగారం దుకాణంలో పట్ట పగలు ఓ యువకుడు మూడు బంగారు గొలుసులతో ఉడాయించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక కచేరీవీధిలోగల షిర్డీసాయి బాబా మందిరం ఎదురుగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి జ్యూయలరీ షాపునకు సోమవారం మధ్యాహ్నం ఓ యువకుడు కారులో వచ్చాడు. బంగారు గొలుసులు కావాలని అడగగా షాపు యజమాని కోరాడ వరప్రసాద్ ఆ యువకుడికి మూడు చైన్లు చూపించారు. ఆ చైన్లను చూస్తున్నట్లు కాసేపు నటించిన యువకుడు షాపు యజమానిని మాటల్లో పెట్టి మూడు గొలుసులు చేతపట్టుకుని ఒక్కసారిగా షాపు నుంచి బయటకు పరిగెత్తాడు. అప్పటికే బయట సిద్ధంగా ఉన్న మారుతీ కారులో పరారైపోయాడని దుకాణం యజమాని తెలిపారు. ఆయన బయటకు వచ్చి చూసేసరికి ఎవరూ కనిపించకపోవడంతో కేకలు వేశారు. అక్కడకు చేరుకున్న తోటి వ్యాపారులు, స్థానికులు ఏం జరిగిందో తెలుసుకుని హుటాహుటిన టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చెయ్యనున్నట్లు తెలిపారు. అయితే పట్టపగలే బంగారం చోరీ జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



చోరీకి ముందు షాపు యజమానితో మాట్లాడుతున్న యువకుడు

క్లుప్తంగా

చెస్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



నంద్యాలలో జరగనున్న చెస్‌పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–19 బాల, బాలికల చెస్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనగా..ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో కె.నితీష, జి.ఖ్యాతిశ్రీ, ఎ.వీణామృత, కె.లిఖితశ్రీలు, బాలుర విభాగంలో కృష్ణ సాయి సూరజ్, ఎం.లిఖిత్, కె.ప్రహ్లాద్, జి.చరణ్‌లు మొదటి స్థానాల్లో నిలిచినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 18,19 తేదీల్లో నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రముఖ న్యాయవాది తాడిరాజు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయగా..న్యాయ నిర్ణేతలుగా పద్మ, సునీత, అర్చన వ్యవహరించారు.

దెబ్బతిన్న తాత్కాలిక కాజ్‌వే



దెబ్బతిన్న పారాది తాత్కాలిక కాజ్‌వే

బొబ్బిలి: పారాది వంతెన శిథిలావస్థకు చేరడంతో కొద్ది నెలల క్రితం వేగావతి నదిపై నిర్మించిన తాత్కాలిక కాజ్‌వే ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. శనివారం కురిసిన వర్షాలకు పాక్షికంగా రక్షణ గోడ పాడవగా, వర్షాలకు వేగావతి నదీనీరు పోటెత్తడంతో తాత్కాలిక కాజ్‌వే పలు చోట్ల పాడైంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముందుగా శనివారం కురిసిన వర్షాలకు వంతెన ముందు చిన్న రంధ్రమైంది. ఆ రంధ్రం మరింత పెరిగి వరద ఉధృతికి కాజ్‌వే పాడైంది. దీనిపై డీఎస్పీ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి కాజ్‌వేను పరిశీలించి ముందుగా పెద్ద ప్రమాదం లేదని భావించి వాహనాలను అనుమతించారు. కానీ తరువాత వాహనాలను ఆపేసి పాత వంతెన పైనుంచే నడిపిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌ను పిలిపించి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏఈ బీవీకే రాజు, సిబ్బంది ధర్మారావు కాజ్‌వే వద్దనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు సమాచారమిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50,116 సాయం



ఆలయ నిర్మాణానికి డబ్బు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి దాతల నుంచి ఆర్థిక సహకారం లభిస్తోంది. అందులో భాగంగా సోమవారం చీపురుపల్లి పట్టణానికి చెందిన వై.వైకుంఠం, ఇందిర దంపతులతో పాటు కుటుంబసభ్యులు రూ.50,116 ఆర్థిక సహకారాన్ని అందజేశారు. ఈ డబ్బులను ఆలయ నిర్మాణ కమిటీ బోర్డు మెంబర్స్ అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణు, ఎస్‌వీజీ.శ్రీను, దాసరి రవిలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణం జరుగుతోందన్నారు.

మేడపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

వంగర: మేడపై నుంచి జారిపడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతున్న రాజాం పట్టణానికి చెందిన బి.వెంకటరావు (30) మృతిచెందినట్లు ఎస్సై వైవీ జనార్దన్ సోమవారం తెలిపారు. వంగర మండల పరిధి అరసాడ జంక్షన్‌లో ఓ స్వీటు దుకాణంలో వెంకటరావు పనిచేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో నిద్రమత్తులో మేడపై నుంచి జారిపడడి గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.

డాక్టర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: డాక్టర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉన్నప్పుడే వైద్యసేవలు సక్రమంగా అందుతాయని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాకు వచ్చిన ఆయనను సోమవారం ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు ఆధ్వర్యంలో డాక్టర్లు విజయనగరంలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్యులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని విన్నవించారు. ఇందుకు మంత్రి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. ఆస్పత్రులు, వైద్యులపై దాడులు జరగకుండా ప్రభుత్వపరంగా తగిన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఐఎంఏ విజయనగరం శాఖ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, కార్యదర్శి డాక్టర్ లెంక శ్రీనివాస్‌తో పాటు వైద్యులు తిరుమల ప్రసాద్, మురళీమోహన్, పీఎస్ ప్రసాద్, అశోక్, గిరి, భవానీ శంకర్, గోపాలరావు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం

- జ్వరాల వ్యాప్తికి ఆస్కారం
- సీజనల్ రోగాలపై అప్రమత్తం
- పరిసరాల పరిశుభ్రత ముఖ్యం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు



పార్వతీపురంలోని యూపీహెచ్‌సీలో వైద పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల కాలం ఆరంభమైనట్లే. వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. అపరిశుభ్రత, ఆహారంలో లోపాల కారణంగా రోగాలు వస్తాయి. ముందు జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోనీరు చేరి నిల్వ ఉండడంతో వ్యాధి కారకాలైన దోమలు, సూక్ష్మ క్రిములు, బాక్టీరియా వృద్ధి చెందుతాయి. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో అక్కడక్కడ మాత్రమే సాధారణ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. వానాకాలంలో సాధారణ జ్వరం దగ్గర నుంచి ప్రమాదకరమైన డెంగీ వరకు సోకే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

వైరల్ జ్వరాలు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీరు ద్వారా సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి జ్వరం వస్తుంది. కొందరికి జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం మూడు నుంచి ఏడు రోజుల వరకు ఉంటుంది.

జాగ్రత్తలు

- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి
- నిల్వ పదార్థాలు తినరాదు
- తాజా, వేడి ఆహారం తీసుకోవాలి

చికున్ గున్యా

దోమ కాటు వల్ల చికున్ గున్యా వస్తుంది. తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు రోగ లక్షణాలు. రోజురోజుకూ జ్వరతీవ్రత పెరుగుతుంది.

జాగ్రత్తలు

- ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి
- కూలర్లు, టైర్లు తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి
- రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

మలేరియా

ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాపిస్తుంది. దోమ కాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయి. 14రోజుల తర్వాత తీవ్ర జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షం నీటిలో వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు

- దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి
- ఇంటి చుట్టూ నీరు నిల్వఉండకుండా చూసుకోవాలి
- నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని లేదా పురుగు మందు కానీ కలపాలి

డెంగీ

ఈడిస్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుంది. వైరల్ మాదిరిగా అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పి ఉంటుంది. ఒక్కోసారి శరీర అంతర భాగాల్లో రక్త స్రావం ఉంటుంది. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదరం భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్న పాటి పొక్కులు వస్తాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుంది. కుండీలు, ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ వస్తువులు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షం నీటిలో ఈడిస్ దోమలు వృద్ధి చెందుతాయి.

జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి
- దోమ తెరలు వాడడం మేలు
- వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలి
- దోమలు కుట్టకుండా శరీరం కప్పేలా దుస్తులు వేసుకోవాలి
- జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి

హెపటైటిస్–ఎ

వర్షాకాలంలో హెపటైటిస్–ఎ (కామెర్లు) వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కలుషితమైన నీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధికి సంబంధించిన సూక్ష్మ క్రిములు శరీరంలోకి వ్యాపిస్తాయి. ఇది కాలేయ కణాల్లో సంక్రమిస్తుంది. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బిలిరుబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

జాగ్రత్తలు

- శుభ్రమైన ఆహారం తీసుకోవాలి
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి
- వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి

టైఫాయిడ్

టైఫాయిడ్ సాల్మొనెల్లా టైఫీ బాక్టీరియా వల్ల వస్తుంది. కలుషితమైన నీరు, ఆహారం వల్ల టైఫాయిడ్ వ్యాపిస్తుంది

జాగ్రత్తలు

- కాచి చల్లారిన నీళ్లు తాగడం ఉత్తమం
- రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీళ్లు తాగాలి
- పండ్ల రసం, కొబ్బరి నీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి
- వైద్యుల సూచనల మేరకు వైద్యసేవలు పొందాలి

స్థానికంగా సకాలంలో వైద్యం

జ్వరాలకు స్థానికంగా, సకాలంలో వైద్యం అందించడానికి జిల్లాలోని 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల రక్తపరీక్షలు అంటుబాటులో ఉన్నాయి. వైద్యులు పూర్తిస్థాయిలో సేవలందిస్తున్నారు. జ్వరాలపై జరుగుతున్న సర్వే ప్రకారం కేసులు ఎక్కువ ఉన్న గ్రామాలు లేదా వార్డుల్లో వైద్య క్యాంపుల ఏర్పాటుకు కూడా వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జ్వరం వస్తే వెంటనే పరీక్షలు

జిల్లాలో జరుగుతున్న ఫీవర్ సర్వేలో జ్వరం ఉన్న వారిని గుర్తించి మొదటగా మలేరియా/ డెంగీ పరీక్ష చేస్తున్నారు. డెంగీ కూడా లేకపోతే కోవిడ్ పరీక్ష చేస్తున్నారు. కోవిడ్ కూడా లేకపోతే సాధారణ జ్వరంగా తీసుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యం అందిస్తున్నారు. పార్వతీపురం, పాలకొండ ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



ప్రస్తుతం సీజనల్ వ్యాధులు సోకే సమయం కావడంతో జ్వరం కేసులు ఉంటే వెంటనే స్థానిక పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి సకాలంలో వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. జ్వరాలు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వైద్య క్యాంపులు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాం. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. శుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలి. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలి.

– డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, జిల్లా మలేరియా అధికారి, పార్వతీపురం మన్యం

అనుమానాస్పదంగా వివాహిత మృతి

- వేధింపులే కారణమంటున్న మృతురాలి బంధువులు



మృతిచెందిన అనూష (తనూజ)



బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ తదితరులు

గజపతినగరం రూరల్: మండలంలోని బంగారమ్మపేట గ్రామానికి చెందిన తాడితూరి అనూష (అలియాస్ తనూజ20) ఆదివారం రాత్రి మృతి చెందగా.. తమ కుమార్తె మృతిపట్ల అనుమానాలున్నాయంటూ మృతురాలి తండ్రి రమణ గజపతినగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాస్ సోమవారం తన బృందంతో గ్రామంలోని సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. గ్రామంలో మృతురాలి బంధువులు, తోటి స్నేహితులను వాకబు చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాలుగు మాసాల క్రితం ఇదే గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్‌తో అనూషకు వివాహమైంది. కాపురం ఆనందంగానే సాగుతోందని, అయితే ఆమె వివాహానికి ముందు ఇదే గ్రామానికి చెందిన బోనివెంకటదుర్గాప్రసాద్ అనూషను ప్రేమించాడని, వివాహమైన తరువాత కూడా చీటికీమాటికీ వేధింపులకు గురిచేసినట్లు తెలిసిందన్నారు. ఈ వేధింపులు ఇటీవల బాగా అధికమవడం, తనతో పాటు బయటకు వచ్చి కోరిక తీర్చాలని, లేకుంటే నీతో తీసుకున్న సెల్ఫీలు, ఆడియో, వీడియో కాల్స్ గ్రామంలోని అందరికి చూపిస్తానని పదేపదే బెదిరించడంతో ఏం చేయాలో తెలియక అనూష ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. చనిపోయేముందు స్నేహితురాలికి, తన అన్నయ్యకు ఫోన్ చేసి అనూష ఈ సమాచారం పంపించిందని, ఈ సమాచారం ఆధారంగా ఈవిషయాలను తెలుసుకున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు ముమ్మరం చేస్తామన్నారు. నివేదిక ఆధారంగా పూర్తిస్థాయి వివరాలను తరువాత వెల్లడించనున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో సీఐ ప్రభాకర్, ఎస్సై యు.మహేష్, తదితరులు పాల్గొన్నారు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాం సిటీ: ఈ నెల 15న ఇంటి వద్ద మెట్లపై నుంచి జారిపడిన పట్టణ పరిధిలో మల్లికార్జునకాలనీకి చెందిన కొల్లా రమణ (79) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఏఎస్సై రమణమ్మ తెలిపారు. మెట్లపైనుంచి జారిపోయి తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడిని వెంటనే కుటుంబసభ్యులు రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువజామున మృతిచెందాడని మృతుడి కుమారుడు కొల్లా వాసు ఫిర్యాదు చేశాడని ఏఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన వ్యక్తి



రెండు కాళ్లు తెగిపడిపోయిన పెంటయ్య

కొత్తవలస: మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన గోలజాపు పెంటయ్య బహిర్భూమికి వెళ్లి రైలు ప్రమాదంలో రెండుకాళ్లు కోల్పోయాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. వేకువజామున బహిర్భూమి కోసం కొత్తవలస రైల్వేస్టేషన్ చివరి ప్లాట్ ఫామ్‌వైపు పెంటయ్య వెళ్తుండగా గుర్తు తెలియని రైలు కిందపడి పోవడంతో రెండుకాళ్లు తెగిపడిపోయాయి. అటువైపు వెళ్లే వారు పరిస్థితిని గమనించి ఆర్‌పీఎఫ్ సిబ్బందికి సమాచారం అందించగా ఎస్సై ఆర్.హసీద్, ఏఎస్సై ఉ.ధర్మారావులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని విశాఖపట్నంలోని కేజీహెచ్‌కి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఘాట్‌రోడ్‌లో వ్యాన్ బోల్తా

- 16 మందికి గాయాలు
- ఏడుగురి పరిస్థితి విషమం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు



బోల్తాపడిన బొలెరో వ్యాన్

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలోని గెడ్డగూడ ఘాట్‌రోడ్‌లో సోమవారం ఉదయం బొలెరో వ్యాన్ బోల్తా పడగా జరిగిన ప్రమాదంలో 16 మందికి గాయాలయ్యాయి. వారిలో తీవ్రంగా గాయపడిన ఏడుగురి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్, జెమ్స్ ఆస్పత్రులకు సీతంపేట వైద్యులు రిఫర్ చేశారు. మిగతా వారంతా స్థానికంగానే చికిత్స పొందుతున్నారు. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 8 మందికి క్షేమంగా బయట పడ్డారు. మరో ముగ్గురికి స్వల్పగాయాలవడంతో వెంటనే కోలుకున్నారు. సీతంపేటలో జరిగే వారపు సంతకు పొంద్ర గ్రామానికి చెందిన 27 మంది (డ్రైవర్‌తో సహా) తమ అటవీఉత్పత్తులైన పైనాపిల్, అరటి, కొండచీపుళ్లు, పనస తదితర అటవీఉత్పత్తులు విక్రయించుకుని, నిత్యావసర సరుకులు వంటివి కొనుగోలు చేసుకోవడానికి వస్తున్నారు. గెడ్డగూడ వద్దకు వచ్చేసరికి వాహనం బ్రేక్ ఫెయిలవడంతో బోల్తాపడింది. వెంటనే 108కు ఫోన్ చేయడంతో పాలకొండ 108 సిబ్బంది నానిబాబు, సింహాచలంలు వచ్చి బాధితులకు సపర్యలు చేసి క్షత గాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే వైద్యాధికారి రాజేష్ వైద్యసేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం సవర జర్మయి, ఎల్లంగు, తిక్కమై, సవర గంగారావు, సుంబురు, మాసయ్య, తవుడు, బూగన్నలను శ్రీకాకుళం రిఫర్ చేశారు. మిగతా వారు ఇక్కడే చికిత్స పొందుతున్నారు. బాధితుడు సవర లుక్కో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ పాండురంగ క్షతగాత్రులను పరామర్శించారు.

బాధితులకు సరైన వైద్యసేవలందివ్వాలి

ప్రమాద ఘటన తెలుసుకున్న పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి స్పందించారు. రోడ్డు ప్రమాద బాధితులకు సరైన వైద్యసేవలు అందివ్వాలని శ్రీకాకుళం, సీతంపేట ఆస్పత్రుల వైద్యసిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కోరారు.

నెల రోజుల వ్యవధిలో రెండు ప్రమాదాలు

గతనెల 27న వంబరెల్లి ఘాట్‌రోడ్ పక్కన ఉన్న లోయలో పడి 17 మందికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆ సంఘటన మరువక ముందే తాజాగా గెడ్డగూడ సమీపంలో ప్రమాదం జరిగి, 16 మంది గాయాల పాలవడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. గత ప్రమాదం కూడా గిరిజనులు సోమవారం వారపు సంతకు వాహనంలో వెళ్లి వస్తుండగానే జరిగింది.

లేగ దూడలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

- ఒడిశా నుంచి తెలంగాణకు తరలిస్తుండగా పట్టివేత



లేగదూడలను తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు

బొండపల్లి: ఎటువంటి అనుమతులు లేకుండా ఐషర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 50 లేగ ఆవుదూడలను వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు గుర్తించి వాహనాన్ని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కిల్లి నాగరాజుతో పాటు తెలంగాణలోని సూర్యాపేట జిల్లాకు చెందిన పెరుమళ్ల లక్ష్మణలు ఐషర్ వ్యాన్‌లో 50 లేగ ఆవుదూడలను తరలిస్తుండడంతో పాటు రవాణాకోసం ఉపయోగించిన మరో వాహనాన్ని తనిఖీల్లో భాగంగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాలోని బాడువా నుంచి లేగదూడలను వాహనాల్లో ఎక్కించి జాతీయ రహదారి26 మీదుగా తెలంగాణకు తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేసి సీజ్ చేశారు. దూడలకు ఎటువంటి ఆహారం అందించకుండా, కాళ్లు విరగ్గొట్టి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీలసులు అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఎంఆర్‌ఐ స్కాన్

- ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్న రోగులు



సర్వజన ఆస్పత్రిలో తెరుచుకోని ఎంఆర్‌ఐ స్కాన్

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కాన్ కొద్ది రోజులుగా పనిచేయడం లేదు. దీంతో ఎంఆర్‌ఐ స్కాన్ అవసరమైన రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎంఆర్‌ఐ స్కాన్ మరమ్మతుల బారిన పడినప్పటికీ వైద్యాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోగులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అధిక మొత్తంలో వెచ్చిస్తున్న రోగులు

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో ఎంఆర్‌ఐ స్కాన్ కోసం రూ.4 వేల నుంచి రూ. 5 వేల వరకు నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ గత్యంతరం లేక చేయించుకుంటున్నామని రోగులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు సమాచారం

ఎంఆర్‌ఐ స్కాన్ మరమ్మతులకు గురైన విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఒకటి, రెండు రోజుల్లో బాగు చేయిస్తాం.

డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సూపరింటెండెంట్, సర్వజన ఆస్పత్రి

19 నుంచి ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మొదటి విడత ప్రవేశానికి ఈనెల 19 నుంచి 26వతేదీవరకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ జిల్లా కన్వీనర్ టీవీ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ధ్రువపత్రాల పరిశీలన చేసుకున్న అభ్యర్థులకు మెరిట్ జాబితా ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు వారి పదవతరగతి జీపీఏ మార్కుల ఆధారంగా కేటాయించిన ర్యాంకుల బట్టి వారికి కేటాయించిన తేదీల్లో ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. కౌన్సెలింగ్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు, మధ్యాహ్నం 1 గంటనుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అభ్యర్థుల మొబైల్ నంబర్‌కు వారి ర్యాంకు, హాజరుకావాల్సిన కౌన్సెలింగ్ తేదీని మెసేజ్ ద్వారా తెలియజేస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా 2,155 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఎన్‌వోసీ తప్పనిసరి

- పెట్రోల్ బంకులు తనిఖీ చేసిన్న సీఎస్‌డీటీ ధనలక్ష్మి



వైష్ణవి పెట్రోల్‌బంకులో రికార్డులు పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ ధనలక్ష్మి

రామభద్రపురం: ప్రజలతో ముడిపడి ఉన్న సంస్థలేవైనా స్థాపించి కొనసాగించాలంటే సంబంధిత యాజమాన్యాలు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని సీఎస్‌డీటీ ధనలక్ష్మి అన్నారు. రామభద్రపురం మండలంలో ఎన్‌వోసీ లేకుండానే పలు పెట్రోలు బంకులు, పత్తి,కోల్డ్ స్టోరేజీలను ఆయా యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన 'నింబంధనలు బేఖాతర్' శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది.ఈ కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సోమవారం సీఎస్‌డీటీ ధనలక్ష్మి తారాపురం అమ్మవారి ఆలయం సమీపంలో ఉన్న వైష్ణవి ఏజెన్సీస్ పెట్రోల్ బంకును తనిఖీ చేశారు.సంబధిత రికార్డులతో పాటు అక్కడ సౌకర్యాలన్నీ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం సాక్షిలో వెలువడిన కథనానికి స్పందించి జేసీతో పాటు జిల్లా పౌరసరఫరాల అధికారి పెట్రోల్ బంకులను తనిఖీలు చేయాలని ఆదేశించారన్నారు. పెట్రోల్ బంకు యాజమాన్యాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. తాగునీరు,మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని, ఎన్‌వోసీతో పాటు సౌకర్యాలు లేని వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాయితీపై విత్తనాల పంపిణీ
- ఎంఎస్‌ఎంఈ మంత్రి శ్రీనివాస్



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: అర్హత ఉన్న ప్రతి రైతుకు రాయితీపై విత్తనాలను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, రైతు సంక్షేమాన్ని శత శాతం నిర్వహించడమే లక్ష్యమని ఎంఎస్‌ఎంఈ, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ విత్తనాలకోసం రైతులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకునే బాధ్యత తనపై ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు విత్తనాలు అందించేలా దృష్టి సారించాలని అధికారులను కోరారు. విత్తనాలతో పాటు, ఎరువులు, యూరియాకూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో, వాతావరణం అనుకూలంగా ఉందని రైతులకు పంట దిగుబడి పెరిగి ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాదికారి వి.టి.రామారావు, ఏడీఏ మహారాజన్, బొబ్బిలి ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, విజయనగరం ఏడీఏ నాగభూషణం, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, పవీవీ గోపాలరాజుతో పాటు నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు